
సాక్షి ప్రకాశం

మంగళవారం । 6 । ఫిబ్రవరి । 2024



నా బిడ్డను ఆశీర్వదించండి..

దర్శిలో తన కుమారుడు బూచేపల్లి శివప్రసాద్‌రెడ్డిని అత్యధిక మెజార్టీతో గెలిపించాలని జిల్లా పరిషత్ చైర్‌పర్సన్ బూచేపల్లి వెంకాయమ్మ అన్నారు. - 8లో..



ఆర్టీసీ బస్సు.. ఆటో ఢీ

జాతీయ రహదారిపై స్థానిక పోలీస్‌స్టేషన్ సమీపంలో ఆర్టీసీ బస్సు, ఆటో ఢీకొన్న ప్రమాదంలో ఒకరు మృతిచెందగా మరో ఇద్దరు గాయపడ్డారు. - 8లో..

గరిష్టం/కనిష్టం
34/24

వాతావరణం

ఆకాశం పాక్షికంగా మేఘావృతమై ఉంటుంది. చల్లని గాలులు వీస్తాయి. పొగమంచు కురుస్తుంది.

న్యూస్‌రీల్

పక్కాగా నులి పురుగుల నివారణ కార్యక్రమం

● కలెక్టర్ ఏఎస్ దినేష్‌కుమార్



ప్రచార పోస్టర్ ఆవిష్కరిస్తున్న కలెక్టర్ దినేష్ కుమార్, డీఎంహెచ్‌వో

ఒంగోలు అర్బన్: ఈ నెల 9వ తేదీ చేపట్టే నులి పురుగుల నివారణ కార్యక్రమాన్ని పక్కాగా అమలు చేయాలని ప్రతి పాఠశాల్లో విద్యార్థులకు నులి పురుగుల నివారణ మాత్రలు అందజేయాలని కలెక్టర్ ఏఎస్ దినేష్‌కుమార్ సంబంధిత అధికారులను ఆదేశించారు. సోమవారం స్పందన హాలులో జిల్లా కో ఆర్డినేషన్ కమిటీ సమావేశం నిర్వహించారు. దీనిలో కలెక్టర్ మాట్లాడుతూ కార్యక్రమంలో భాగస్వాములైన వైద్య ఆరోగ్యశాఖ, ఐసీడీఎస్, రెవెన్యూ, పంచాయతీ, మున్సిపల్, విద్యాశాఖల అధికారులు, సిబ్బంది సమన్వయంతో పనిచేయాలన్నారు. పాఠశాలలతో పాటు అంగన్‌వాడీ కేంద్రాలు, బస్టాండ్, రైల్వే స్టేషన్ వంటి ప్రాంతాల్లో కూడా నులిపురుగుల నివారణ మాత్రలు పంపిణీ చేయాలన్నారు. మాత్రలు ఏవిధంగా తీసుకోవాలో కూడా అవగాహన కల్పించాలన్నారు. దీనిలో డీఎంహెచ్ రాజ్యలక్ష్మి, ఎన్‌సీడీ నోడల్ అధికారి భగీరథి, డీఈఓ సుబ్బారావు, డీఎల్‌డీఏ సురేష్, ఇతర జిల్లా అధికారులు పాల్గొన్నారు.

18 మందికి కారుణ్య నియామకాలు



ఉద్యోగ నియామకపత్రాలు పొందిన వారితో కలెక్టర్ దినేష్ కుమార్

ఒంగోలు అర్బన్: స్పందన హాలులో సోమవారం కారుణ్య నియామకం కింద 18 మందికి కలెక్టర్ ఏఎస్ దినేష్‌కుమార్ నియామక పత్రాలు అందజేశారు. ఆర్టీసీతో పాటు ఇతర ప్రభుత్వ శాఖల్లో విధులు నిర్వహిస్తూ మరణించిన ఉద్యోగి వారసులకు విద్యార్హతలను బట్టి ఉద్యోగ నియామకాలు చేశారు. కష్టపడి పనిచేసి ప్రజలకు సేవలందించాలని కలెక్టర్ సూచించారు. దీనిలో జాయింట్ కలెక్టర్ గోపాలకృష్ణ, ట్రైనీ కలెక్టర్ శౌర్యమన్ పటేల్, సచివాలయాల నోడల్ అధికార ఉషారాణి, ఇతర అధికారులు పాల్గొన్నారు.

వైభవంగా అభిషేకోత్సవం



అభిషేకానంతరం విశిష్ట పూజల్లో ఆలయ కమిటీ, నాయకులు, భక్తులు

సీఎస్‌పురం(పామూరు): ప్రఖ్యాత పుణ్య క్షేత్రం మండలంలోని మిట్టపాలెం నారాయణస్వామి ఆలయంలో సోమవారం అభిషేకోత్సవం, స్వామి ఆలయ ఉత్సవం రుత్విక్కులు మహంకాళి ప్రసాదుశర్మల ఆధ్వర్యంలో వేదమంత్రాలతో ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా నారాయణస్వామి అభిషేకం, విశిష్ట పూజలు నిర్వహించారు. అనంతరం భజంత్రీల మేళతాళాల నడుమ స్వామిని పల్లకీపై ఉంచి ఆలయ ఉత్సవం నిర్వహించారు. దేవస్థాన కమిటీ ఆధ్వర్యంలో భక్తులకు తీర్ధ ప్రసాదాలు అందజేశారు. ఆలయ వ్యవస్థాపక చైర్మన్ కొమ్మినేని చిన్న ఆదినారాయణ, కొమ్మినేని వెంకట్రావు, పలువురు పాల్గొన్నారు.

ఆలయ ఆదాయం రూ.75,442

నారాయణస్వామి ఆలయ ఆదివారం ఆదాయం రూ.75,442 వచ్చినట్లు వ్యవస్థాపక చైర్మన్ ఆదినారాయణ, ఈఓ జి.రమణారెడ్డి తెలిపారు. స్వామి టిక్కెట్ల విక్రయంద్వారా రూ.36,210, లడ్డు ప్రసాదం అమ్మకంద్వారా రూ.22,760, అన్నదానం విరాళాల ద్వారా రూ.16,472 ఆదాయం వచ్చినట్లు పేర్కొన్నారు.



ఆలయ ఉత్సవంలో పాల్గొన్న అర్చకులు, కమిటీ, భక్తులు

సొంతింటి సంతోషం

పశ్చిమ ప్రకాశంలో ఒకప్పుడు ఊళ్లంటే 15, 20 ఇళ్లతో ఏర్పడేవి..ఇప్పుడు పరిస్థితి మారింది. 75, 100, 200 ఇలా కొత్త ఇళ్లతో కొత్త ఊళ్లే వెలుస్తున్నాయి. ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి తీసుకున్న జగనన్న కాలనీల ఏర్పాటు నిర్ణయంతో పేదలకు సొంతింటి కల నెరవేరుతోంది. అంతేకాదు అయా గ్రామాల రూపురేఖలు మారిపోతున్నాయి. సకల వసతులతో కళ్లెదుటే ఖరీదైన లోగిళ్లు ఏర్పాటవుతుండడంపై పేదలు హర్షం వ్యక్తం చేస్తున్నారు. ఇది కాదా అభివృద్ధి అంటూ ప్రజలు ప్రతిపక్ష పార్టీ నేతలను ప్రశ్నిస్తున్నారు.



ఇడుపూరులో జగనన్న కాలనీ లే అవుట్

- పేదలకు పూర్తి హక్కులు కల్పిస్తూ రిజిస్ట్రేషన్లు
- సచివాలయాల్లో లబ్ధిదారులకు రిజిస్ట్రేషన్ ఏర్పాట్లు
- పశ్చిమ ప్రకాశంలో 12,686 గృహాల మంజూరు
- ఇప్పటికే 7697 గృహ నిర్మాణాలు పూర్తి
- వివిధ దశల్లో మిగిలిన గృహాలు
- ఇది కదా అభివృద్ధి అంటే..



మార్కాపురం: నవరత్నాలు పేదలందరికీ ఇళ్లు పథకాన్ని వైఎస్సార్ సీపీ ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా చేపట్టింది. జగన్న కాలనీల ఏర్పాటు ప్రక్రియ శరవేగంగా సాగుతోంది. పశ్చిమ ప్రకాశంలో మొత్తం 212 లేఅవుట్లలో 12,868 గృహాలు మంజూరయ్యాయి. ఇందులో జగనన్న లేఅవుట్లు, సొంత స్థలాల్లో 7,697 గృహాలు పూర్తి కాగా, మిగిలినవి బేస్‌మెంట్, రూఫ్ లెవెల్, ప్లింత్ లెవెల్, శ్లాబ్‌లు పూర్తికావాల్సినవి ఉన్నాయి. పల్లెలు, పట్టణాలనీ తేడాలు లేకుండా ఊరి శివార్లలో జగనన్న కాలనీల పేర్లతో కొత్త ఊర్లే ఏర్పాటవుతున్నాయి. అధికారంలోకి రాకముందు నవరత్నాల పథకాలు ప్రకటించి అందులో అర్హులైన పేదలందరికీ ప్రభుత్వమే ఉచితంగా ఇల్లు కట్టించి ఇస్తానన్న వైఎస్ జగన్‌మోహన్ రెడ్డి ప్రతిపక్ష నేతగా ఇచ్చిన హామీని సీఎం కాగానే నెరవేర్చారు. నీళ్ల, కరెంటు, రోడ్లు ఇలా మౌలిక వసతులు ఏర్పాటు చేస్తున్నారు. ఇదే సమయంలో జగనన్న కాలనీలోని ఇళ్ల స్థలాలను రిజిస్ట్రేషన్ చేసి లబ్ధిదారులకే రిజిస్ట్రేషన్ పత్రాలు అందించే ఏర్పాట్లు చేస్తోంది. గ్రామ సచివాలయాల్లో ఈ ఏర్పాట్లు ముమ్మరంగా జరుగుతున్నాయి. పేదింట్లో సొంతిటి సంతోషాన్ని నింపుతోంది.

ఇంటి నిర్మాణానికి ఆర్థిక సాయం:

లబ్ధిదారులు ఇళ్లు కట్టుకునేందుకు ప్రభుత్వం ఆర్థిక సాయం అందజేస్తోంది. ఒక్కొక్క ఇంటికి రూ.1.80 లక్షలు అందిస్తోంది. లబ్ధిదారుల్లో డ్వాక్రా మహిళలుంటే రూ.35 వేల రుణం బ్యాంకుల ద్వారా ఇస్తున్నారు. ఇవి కాకుండా ఇసుక, సిమెంటు, ఇనుము కూడా ఇస్తున్నారు. మార్కాపురం పట్టణ శివార్లలోని ఇడుపూరు-1, ఇడుపూరు-3, వేములకోట, రాయవరం, పొదిలి, లేఅవుట్లలో ఒక్కసారి గమనిస్తే ఎవరికైనా కొత్త గ్రామాలు ఏర్పాటైనట్లు స్పష్టంగా కనిపిస్తే ఇడుపూరు 1, 3లో 2628 గృహాలు మంజూరు కాగా 720 ఇళ్లు పూర్తయ్యాయి. 378 గృహాలు రూఫ్‌లెవెల్లో, 727 ఇళ్లు బేస్‌మెంట్లో, 340 ఇళ్లు ప్లింత్ లెవెల్‌లో పూర్తయ్యాయి. గ్రామ సచివాలయాల్లో లబ్ధిదారులకు రిజిస్ట్రేషన్ల ప్రక్రియ ప్రారంభించారు. సెలవు రోజుల్లో సైతం రిజిస్ట్రేషన్ల ప్రక్రియ నిర్వహించాలని ప్రభుత్వం ఆదేశించింది.

ఉపయోగాలివీ..

గత ప్రభుత్వాలు పట్టాలు ఇచ్చినప్పటికీ ఇంటి నిర్మాణాలు పూర్తి చేయకపోగా కొన్ని పూర్తయినా వాటిపై హక్కులు ప్రభుత్వానికి ఉండేవి. దీనివలన ఆ ఇంటిపై బ్యాంకుల్లో రుణాలు తీసుకునే అవకాశం లేదు. ఈ ఇబ్బందులు గమనించిన వైఎస్ జగన్ ప్రభుత్వం స్థలం రిజిస్ట్రేషన్ ద్వారా ఇంటి యజమానికి పూర్తి హక్కులు కల్పిస్తోంది. బ్యాంకుల్లో తనఖా పెట్టి అవసరమైనప్పుడు లోన్ తీసుకోవచ్చు. అత్యవసర సమయాల్లో ఇంటిని అమ్ముకోవచ్చు. కుటుంబ వారసులకు గిఫ్ట్ డీడ్ కింద రిజిస్ట్రేషన్ చేయవచ్చు. ఇలా లబ్ధిదారులకు ఆ ఇంటిపై సర్వహక్కులను జగనన్న ప్రభుత్వం కల్పిస్తోంది. పదేళ్ల తరువాత ఇవన్నీ సేల్‌డీడ్‌లుగా మారుతాయి.

అన్నీ సౌకర్యాలు..

జగనన్న కాలనీల్లో రోడ్లు, డ్రైనేజీ సిస్టం, విద్యుత్ సౌకర్యం, తాగునీటి సరఫరా ఇలా అన్నీ సౌకర్యాలను ప్రభుత్వం కల్పిస్తోంది. ఇప్పటికే మార్కాపురం సమీపంలోని ఇడుపూరు లేఅవుట్‌లో విద్యుత్ స్తంభాలు వేసి వీధిలైట్లు బిగించారు. నీటి సరఫరా కోసం వాటర్ ట్యాంకులను కూడా కట్టారు. అంతర్గత రోడ్ల నిర్మాణం కూడా పూర్తికావస్తోంది. ప్రతి ఇంటికి విద్యుత్ మీటర్లు కూడా ఉచితంగా బిగించారు.

నియోజకవర్గాల వారీగా వివరాలు ఇలా..

నియోజకవర్గం	లేఅవుట్లు	మంజూరైన గృహాలు	పూర్తైన
మార్కాపురం	42	7,486	2498
యర్రగొండపాలెం	54	2,154	1593
గిద్దలూరు	116	3,228	3606
మొత్తం	212	12,868	7,697



జగనన్న లే అవుట్‌లో నిర్మాణంలో ఉన్న గృహాలు

కల నెరవేరుతోంది



కొన్ని దశాబ్దాల సొంతింటి కల నెరవేరుతోంది. జగనన్న ప్రభుత్వంలో నాకు ఇంటి స్థలం మంజూరుతోపాటు ఇల్లు కూడా ప్రభుత్వమే కట్టించి ఇస్తోంది. జగనన్నకు కృతజ్ఞతలు.

– జీ లక్ష్మీదేవీ, మార్కాపురం

చాలా సంతోషంగా ఉంది



నాకు చెన్నరాయునిపల్లి లేఅవుట్‌లో ప్రభుత్వం పట్టాతో పాటు ఇంటిని మంజూరు చేసింది. ఇల్లు నిర్మించుకుంటున్నాను. సొంతిల్లు కట్టుకుంటున్నానన్న సంతోషం మా కుటుంబ సభ్యుల్లో ఉంది. ఇన్నాళ్లకు మా కల నెరవేరుతోంది. ప్రభుత్వానికి ధన్యవాదాలు.

– ఎన్ సుభాషిణి, మార్కాపురం

త్వరగా ఇళ్ల నిర్మాణాలు పూర్తిచేసుకోండి



జగనన్న లేఅవుట్లలో లబ్ధిదారులందరూ ఇళ్ల నిర్మాణాలు త్వరగా పూర్తిచేసుకోండి. బిల్లులు ఎక్కడా పెండింగ్ పెట్టడం లేదు. డ్వాక్రా మహిళలైతే బ్యాంకు రుణం కూడా ఇస్తున్నారు. ఈ డబ్బులను ఉపయోగించుకుని త్వరగా ఇంటి నిర్మాణం పూర్తిచేసుకోండి. మార్కాపురం శివార్లలోని ఇడుపూరు, వేములకోట, రాయవరం లేఅవుట్లలో ఇంటి నిర్మాణాలు వేగంగా జరుగుతున్నాయి. ప్రభుత్వం కల్పిస్తున్న రాయితీలను సద్వినియోగం చేసుకోండి. సచివాలయాల్లో రిజిస్ట్రేషన్ ప్రక్రియ కూడా ప్రారంభమైంది.

– పవన్‌కుమార్, డీఈ మార్కాపురం



● **కలసినడుద్దాం..**

ఒంగోలు పార్లమెంట్ పరిధిలోని అన్ని నియోజకవర్గాల్లో వైఎస్సార్ సీపీ విజయం సాధించే దిశగా నేతలు కలసికట్టుగా అడుగులు వేస్తున్నారు. విజయవాడలోని ఓ హోటల్‌లో సోమవారం మాజీ మంత్రి, ఎమ్మెల్యే బాలినేని శ్రీనివాసరెడ్డి, ఒంగోలు పార్లమెంట్ రీజినల్ కో ఆర్డినేటర్ చెవిరెడ్డి భాస్కరరెడ్డి, మంత్రి ఆదిమూలపు సురేష్, ఎమ్మెల్యేలు అన్నా రాంబాబు, కుందురు నాగార్జునరెడ్డి, మాజీ ఎమ్మెల్యే బూచేపల్లి శివప్రసాద్‌రెడ్డి, యర్రగొండపాలెం, కనిగిరి నియోజకవర్గ ఇన్‌చార్జిలు తాటిపర్తి చంద్రశేఖర్, దద్దాల నారాయణ కలుసుకున్నారు. అంతాఒక్కటై ఎన్నికల్లో పార్టీ విజయానికి అనుసరించాల్సిన వ్యూహంపై చర్చించారు.

ప్రజా సమస్యలు సత్వరం పరిష్కరించాలి



ప్రజల నుంచి అర్జీలు స్వీకరిస్తున్న కలెక్టర్ దినేష్ కుమార్

● స్పందన నిర్వహించిన కలెక్టర్ దినేష్‌కుమార్

ఒంగోలు అర్బన్: ప్రజా సమస్యలను క్షేత్రస్థాయిలో పరిశీలించి సమస్య పునరావృతం కాకుండా నాణ్యతతో పరిష్కరించాలని కలెక్టర్ ఏఎస్ దినేష్‌కుమార్ అధికారులను ఆదేశించారు. సోమవారం స్పందన హాలులో స్పందన ప్రజా సమస్యల పరిష్కార వేదిక కార్యక్రమం నిర్వహించి ప్రజల నుంచి అర్జీలు స్వీకరించారు. అర్జీదారులు సంతృప్తి చెందేలా గ్రామ స్థాయి నుంచి జిల్లా స్థాయి వరకు అధికారులు సిబ్బంది పనిచేయాలన్నారు. స్పందన అర్జీలను నిర్ణీత గడువులో పరిష్కరించాలన్నారు. తొలుత డయల్ యువర్ కలెక్టర్ కార్యక్రమం నిర్వహించి దూర ప్రాంత ప్రజల సమస్యలు తెలుసుకుని, సంబంధిత అధికారులకు పరిష్కరించాలని ఆదేశించారు. కార్యక్రమంలో జాయింట్ కలెక్టర్ గోపాలకృష్ణ, ట్రైనీ కలెక్టర్ శౌర్యమన్ పటేల్, స్పెషల్ డిప్యూటీ కలెక్టర్లు లోకేశ్వరరావు, ఝాన్సీలక్ష్మీ, జెడ్పీ సీఈఓ జాలిరెడ్డి ఇతర జిల్లా అధికారులు పాల్గొన్నారు.

☛ సంతనూతలపాడు మండలం మంగమూరు గ్రామానికి చెందిన తనిపర్తి వెంకట రమణమ్మ స్పందనలో అధికారులను కలిసి తాను దివ్యాంగ పింఛన్ పొందేందుకు అన్నీ అర్హతలు ఉన్నాయని క్షుణ్ణంగా పరిశీలించి పింఛన్ మంజూరు చేయాలని కోరుతూ అర్జీ అందజేసింది.

దొనకొండ మండలం ఒబ్బాపురం గ్రామానికి చెందిన ఉమామహేశ్వరి స్పందనలో అధికారులను కలిసి తన భర్త మరణించాడని, తనకు వితంతు పింఛన్ ఇప్పించాలని కోరుతూ అర్జీ అందచేసింది. సచివాలయంలో దరఖాస్తు చేసుకున్నానని, పరిశీలించి న్యాయం చేయాలని కోరింది.



బారులుతీరిన ప్రజలు

పదే పదే అబద్ధాలు రాస్తే నిజమైపోదు

- తప్పుడు ప్రచారం చేసి ప్రజలను నమ్మించాలనుకుంటే భ్రమ
- నేను ఏమిటో నా స్వభావం ఏంటో ప్రజలకు తెలుసు
- మంత్రి, కొండపి నియోజకవర్గ ఇన్‌చార్జి డాక్టర్ ఆదిమూలపు సురేష్

టంగుటూరు: పదే పదే అబద్ధాన్ని పచ్చ పత్రికల్లో రాసి, పచ్చ మీడియా మైకుల్లో చెప్పినంత మాత్రాన నిజమై పోతుందనుకోవటం వారి భ్రమ అని రాష్ట్ర పురపాలక, పట్టణాభివృద్ధి శాఖ మంత్రి, కొండపి నియోజకవర్గ ఇన్‌చార్జి డాక్టర్ ఆదిమూలపు సురేష్ అన్నారు. ప్రచారానికి కొందరి వద్ద డబ్బులు వసూలు చేస్తున్నారంటూ తనపై ఎమ్మెల్యే స్వామితో పాటు ఆయనకు అనుకూల మీడియా కలిసి ఇటీవల చేస్తున్న తప్పుడు ప్రచారాన్ని మంత్రి ఆదిమూలపు సురేష్ సోమవారం ఖండించారు. ఈ సందర్భంగా మంత్రి ఆదిమూలపు సురేష్ మాట్లాడుతూ తాను ఏమిటో తన స్వభావం ఏంటో ప్రజలకు తెలుసని చెప్పారు. పదో తరగతి విద్యార్థుల కోసం తాను సొంతంగా ముద్రించి ఇచ్చిన పుస్తకాలను కూడా రాజకీయం చేస్తూ వాటి కోసం డబ్బులు అధికారుల వద్ద తీసుకున్నానని ప్రచారం చేయటం వల్ల వాళ్లకు ఎంతగా రాజకీయ లబ్ధి జరుగుతుందో వారి విజ్ఞతకే వదిలేస్తున్నానని అన్నారు. ఎమ్మెల్యేకు గానీ, ఆయనకు అనుకూలంగా మారి మంత్రినైన నన్ను టార్గెట్ చేసిన ఆ పత్రికకు గానీ నేను సమాధానం చెప్పాల్సిన అవసరం లేదని, ప్రజలకు వాస్తవం తెలుసని అన్నారు. దాదాపు 40 ఏళ్లగా విద్యా సంస్థలు నడుపుతున్నానని, విద్యార్థుల కోసం గతంలో తాను చేపట్టిన కార్యక్రమాలు పరిశీలిస్తే తెలుస్తుందన్నారు. యండమూరి వీరేంద్రనాథ్ లాంటి ఎందరో ప్రముఖులతో విద్యార్థుల కోసం ప్రేరణ తరగతులు నిర్వహించానన్నారు. పరీక్షల సమయాల్లో చేపట్టే కార్యక్రమాలు కానీ, ఉచితంగా నోట్ పుస్తకాల పంపిణీ, ఆర్థికంగా ఇబ్బంది పడే వారికి ఉచిత విద్య అందిస్తున్న విద్యావంతుల కుటుంబం మాది అని గుర్తు చేశారు. పుస్తకాలు ముద్రించటానికి, లేదా ఇతర కార్యక్రమాలకు ఆర్థికంగా ఎవరిమీదో ఆధారపడాల్సిన అవసరం తనకు లేదన్నారు. తాను కొండపి నియోజకవర్గం వచ్చినప్పటి నుంచి ఎమ్మెల్యే స్వామి తననే టార్గెట్ చేసి మాట్లాడుతున్నారని, అవే మాటలు ఆయనకు అనుకూల మీడియా కూడా పదే పదే వండి పాఠకుల ముందు ఉంచుతోందన్నారు. ఎన్ని రాసుకున్నా అబద్ధం ఎప్పటికీ నిజం కాదని, నాపై ప్రజలకు నమ్మకం ఏర్పడి, జగనన్న పై విశ్వాసంతో రాబోయే ఎన్నికల్లో విజయాన్ని అందించేందుకు ప్రజలు కంకణం కట్టుకున్నారని చెప్పారు. అది గమనించి దిక్కుతోచని స్థితిలో ఇటువంటి తప్పుడు ప్రచారాలకు తెరతీశారని, వారికి ప్రజలే బుద్ధి చెబుతారని ఆదిమూలపు సురేష్ హెచ్చరించారు.



డాక్టర్ ఆదిమూలపు సురేష్

పేదల మరుగుదొడ్లు కాజేయటానికి సిగ్గు లేదా..

కొండపి నియోజకవర్గంలోని ఆరు మండలాల్లో పేదలకు మంజూరైన మరుగుదొడ్లను టీడీపీ ఎమ్మెల్యే డోలా బాలవీరాంజనేయ స్వామి అవినీతి అక్రమాలకు పాల్పడి ప్రజల సొమ్మును కాజేయటానికి సిగ్గు లేదా.. నువ్వా నా గురించి మాట్లాడేదని మంత్రి, కొండపి నియోజకవర్గ ఇన్‌చార్జి డాక్టర్ ఆదిమూలపు సురేష్ హెచ్చరించారు. కొండపి నియోజకవర్గంలోని ఆరు మండలాల్లో ఎస్సీ, ఎస్టీ, బీసీ, మైనార్టీలకు మంజూరైన మరుగుదొడ్ల నిర్మాణంలో ఎమ్మెల్యే స్వామి భారీ అవినీతికి పాల్పడి మరుగుదొడ్లు నిర్మించకుండా తనతో పాటు గ్రామాల్లోని టీడీపీ నాయకుల జేబులు నింపుకున్నారన్నారు. కేంద్ర ప్రభుత్వం స్వచ్ఛ భారత్ ద్వారా గ్రామీణ ప్రాంతాల్లోని మరుగుదొడ్డి లేని ప్రతి కుటుంబానికి రూ.15 వేలతో మరుగుదొడ్డి నిర్మించాలని నిధులు విడుదల చేస్తే ఎమ్మెల్యే స్వామి, టీడీపీ నాయకులు, జన్మభూమి కమిటీ సభ్యులు ఏ గ్రామంలో కూడా మరుగుదొడ్లు నిర్మించకుండా స్వచ్ఛంద సంస్థల పేరుతో సుమారు రూ.22 కోట్ల నిధులు దోచేశారన్నారు. దామచర్ల కుటుంబంపై ఆధారపడి రాజకీయం చేస్తున్నావని, అంబేడ్కర్ రాజ్యాంగ హక్కు కల్పించి నిన్ను ఎమ్మెల్యే చేస్తే దామచర్ల కుటుంబం వద్ద బానిసగా బతుకుతున్న నీవు నా మీద అబద్ధపు ప్రచారం చేయటం సరికాదన్నారు.

ఇచ్చిన మాట నిలబెట్టుకున్న జగనన్న

● జెడ్పీ చైర్‌పర్సన్ బూచేపల్లి వెంకాయమ్మ

దొనకొండ: ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి పాదయాత్రలో ప్రజలకు ఇచ్చిన హామీలు వందకు వంద శాతం నెరవేర్చుకున్నారని జిల్లా పరిషత్ చైర్‌పర్సన్ బూచేపల్లి వెంకాయమ్మ, దర్శి నియోజకవర్గ ఇన్‌చార్జి, మాజీ ఎమ్మెల్యే బూచేపల్లి శివప్రసాదరెడ్డి కొనియాడారు. మండలంలోని చందవరంలో సోమవారం రాత్రి మన ఊరికి మన శివన్న కార్యక్రమం జరిగింది. తొలుత అంకాల పరమేశ్వరి ఆలయంలో వారు పూజలు చేశారు. గ్రామస్తులు పూలు చల్లుకుంటూ వారికి స్వాగతం పలికారు. చందవరం, బట్టేపాడు, ఎస్సీ కాలనీ, దేశిరెడ్డిపల్లి గ్రామాల్లోని పురవీధుల్లో తిరిగి ప్రజలతో మమేకమయ్యారు. ప్రజల ఆశీస్సులు పొందారు. ఈ సందర్భంగా వెంకాయమ్మ మాట్లాడుతూ మండలంలోని చందవరం నుంచి మన ఊరు మన శివన్న కార్యక్రమం చేపట్టామని, నా బిడ్డ రాబోయే అసెంబ్లీ ఎన్నికల్లో పోటీ చేస్తున్నారని, మీ బిడ్డగా, మీ అన్నగా, మీ తమ్మునిగా భావించి అత్యధిక మెజార్టీతో గెలిపించాలని ప్రజలను కోరింది. చందవరం గ్రామంలో పాఠశాలలు లేక విద్యార్థులు ఇబ్బంది పడుతున్న దృష్ట్యా తాము చైర్మన్ అయిన తర్వాత నిధులు కేటాయించి నూతన తరగతి గదులు నిర్మించామని, గతంలో విద్యార్థులు చదువుకోవడానికి ఇబ్బందులు పడేవారని, అలాంటి సమస్య నేడు లేదని ఆమె గుర్తు చేశారు. శివన్న మాట్లాడుతూ 2004లో మా నాన్నగారిని, 2009లో తనను చందవరం గ్రామస్తులు అధిక మెజార్టీతో గెలిపించారని, వారికి మేము రుణపడి ఉంటామన్నారు. చందవరం గ్రామానికి రూ.20 కోట్లు సంక్షేమ పథకాల ద్వారా ప్రభుత్వం అందించిందన్నారు. మీ శివన్న మీ దగ్గరికి వస్తున్నాడు, మీ తమ్ముడు అనుకుంటారో, అన్న అనుకుంటారో 2024లో తనను అధిక మెజార్టీతో గెలిపించాలని ప్రార్థించారు. టీడీపీ ప్రభుత్వంలో ఐదేళ్ల దళారి వ్యవస్థ ఉండి ప్రజలు, రైతులు చాలా ఇబ్బంది పడే వారని, అలాంటి సమస్య లేకుండా ముఖ్యమంత్రి జగన్‌మోహన్‌రెడ్డి వారి ఖాతాల్లో జమ చేస్తున్నారని, అలాంటి జగనన్నను మళ్లీ ముఖ్యమంత్రి చేసుకోవాలన్నారు. నవరత్నాల్లో మహిళలకు నూటికి నూరు శాతం హామీలు పూర్తి చేసిన ఘనత మన జగనన్నదే అన్నారు. రాజన్నకు పులి లాంటి జగనన్న, బాబుకు పప్పు లాంటి లోకేష్ పుట్టాడని ఎద్దేవా చేశారు. లోకేష్ మంగళగిరి చెత్తగా ఓడిపోయి ఎమ్మెల్సీ సీటు పొంది దొడ్డి దారిన మంత్రి అయి, మళ్లీ ఏ ముఖం పెట్టుకుని ప్రజల వద్దకు వస్తున్నారని విమర్శించారు. చంద్రబాబు అబద్ధాలు మాట్లాడుతూ మామను వెన్నుపోటు పొడిచి అధికారంలోకి రావటం సిగ్గుచేటన్నారు. మాట నిలబెట్టుకున్న వ్యక్తి జగనన్నను రానున్న ఎన్నికల్లో గెలిపించుకుందామంటూ పిలుపునిచ్చారు. శివన్న సతీమణి నందిని, కాపా రమణారెడ్డి, ఎంపీపీ బొరిగొర్ల ఉషామురళి, మాజీ కన్వీనర్ కాకర్ల కృష్ణారెడ్డి, కర్నాటి అంజనేయరెడ్డి, సర్పంచ్ వజ్రగిరి రాణి సాలోమన్, ఎంపీటీసీ బండారు రాజు, పిల్లి ఓబులరెడ్డి, దగ్గుల వెంకటేశ్వరరెడ్డి,డి. చెంచిరెడ్డి, ఎగ్గోని కృష్ణారెడ్డి, వై.నాగేశ్వరరావు, దేశిరెడ్డి వెంకటేశ్వరరెడ్డి, గుమ్మా వెంకటేశ్వర్లు, గుంటు పోలయ్య, కోఆప్షన్ షేక్.గఫార్, ఇమ్రాన్‌ఖాన్, గోనె జాకోబు పాల్గొన్నారు.



చందవరంలో మాట్లాడుతున్న వెంకాయమ్మ

నకిలీ మిర్చి విత్తనాలతో మోసపోయాను ఆదుకోండి

● సబ్‌కలెక్టర్‌కు వినతి

మార్కాపురం: మార్కాపురం పట్టణంతోపాటు చింతగుంట్లలోని ఒక ఎరువులు, విత్తనాల షాపులో సుమారు రూ.20 వేల విలువైన విత్తనాలు కొనుగోలు చేసి తనకున్న మూడెకరాల పొలంలో నాటితే కాయలు రాలేదని, పూత రాలిపోతోందని, నకిలీ విత్తనాలు సాగుచేయడం వలననే ఇలా జరిగిందని న్యాయం చేయాలని కోరుతూ మార్కాపురం మండలంలోని వేములకోట గ్రామానికి చెందిన మిర్చిరైతు తిరుమలరెడ్డి రామిరెడ్డి సబ్‌కలెక్టర్ రాహుల్‌మీనాకు స్పందనలో అర్జీ ఇచ్చారు. వ్యవసాయాధికారులను పంపి తాను సాగుచేసిన పొలాన్ని పరిశీలించి విత్తన కంపెనీల నుంచి నష్టపరిహారం ఇప్పించాలని కోరారు. వివిధ గ్రామాల్లో నెలకొన్న తాగునీటి సమస్యను పరిష్కరించాలని రైతు సంఘం నేత జీ వెంకట రామిరెడ్డి వినతిపత్రం ఇచ్చారు. కాగా ప్రధానమంత్రి విశ్వకర్మయోజన పథకంపై అధికారులు ప్రత్యేక దృష్టి పెట్టాలని బీజేపీ నాయకులు బొంతల కృష్ణ, రాజా శ్రీకాంత్, సుబ్బారావు తదితరులు వినతిపత్రం ఇచ్చారు.



సబ్‌కలెక్టర్‌కు వినతిపత్రం ఇస్తున్న రామిరెడ్డి

రేషన్ పంపిణీ పరిశీలన

ఒంగోలు అర్బన్: ఎండీయూ వాహనం వద్ద రేషన్ సరుకుల పంపిణీని జాయింట్ కలెక్టర్ గోపాలకృష్ణ సోమవారం సిబ్బందికి కూడా తెలియకుండా ఆకస్మాత్తుగా తనిఖీ చేశారు. నగరంలోని ప్రకాశం కాలనీలో పంపిణీ చేస్తున్న మొబైల్ వాహనం వద్ద పరిశీలించారు. స్టాకు వివరాలు, సరుకులు పంపిణీ చేస్తున్న విధానంతో పాటు కార్డుదారులతో నేరుగా మాట్లాడి పంపిణీపై ఆరా తీశారు. మరింత మెరుగ్గా పంపిణీ చేయాలని ఎండీయూ ఆపరేటర్‌కు సూచించారు. జిల్లా వ్యాప్తంగా ఆకస్మిక తనిఖీలు చేపడతామని జాయింట్ కలెక్టర్ తెలిపారు.



రేషన్ సరఫరా చేస్తున్న వాహనాన్ని పరిశీలిస్తున్న జాయింట్ కలెక్టర్ గోపాలకృష్ణ

క్లుప్తంగా

మృతుడు శంఖవరం వాసి

మార్కాపురం: పట్టణ పోలీసుస్టేషన్ పరిధిలోని బోడపాడు రూటులో శనివారం అర్ధరాత్రి అనుమానాస్పదస్థితిలో మృతి చెందిన వ్యక్తిని గుర్తించినట్లు పట్టణ ఎస్సై రెహమాన్ తెలిపారు. మృతుడు కనిగిరి మండలం శంఖవరం గ్రామానికి చెందిన తోట శ్రీను (43)గా గుర్తించామన్నారు. చెడు వ్యసనాలకు లోనై ఇంటి నుంచి బయటకు వచ్చి తిరుగుతుంటాడని కుటుంబ సభ్యులు తెలిపినట్లు ఎస్సై పేర్కొన్నారు.

100 మద్యం బాటిళ్లు స్వాధీనం



స్వాధీనం చేసుకున్న మద్యంబాటిళ్లు, నిందితునితో ఎస్సై సైదుబాబు

పామూరు: స్థానిక కందుకూరు రోడ్డులో అక్రమంగా తరలిస్తున్న మద్యం బాటిళ్లను స్వాధీనం చేసుకున్నట్లు ఎస్సై ఎం సైదుబాబు తెలిపారు. కందుకూరురోడ్డులో వాహనాలు తనిఖీచేస్తుండగా కారులో అక్రమంగా 100 మద్యం బాటిళ్లను నిల్వచేసి తరలిస్తున్న ఓ యువకుడిని అరెస్ట్ చేశామన్నారు. బాటిళ్లను స్వాధీనం చేసుకొని కారును సీజ్ చేసి నిందితునికి రిమాండ్ విధించినట్లు ఎస్సై సైదుబాబు తెలిపారు. ఎక్కడైనా అక్రమంగా మద్యం నిల్వ ఉంచినా, తరలిస్తున్నా సమాచారం ఇవ్వాలని ఎస్సై కోరారు.

ఉపాధ్యాయుల శిక్షణను పరిశీలించిన జేడీ



ఉపాధ్యాయులతో మాట్లాడుతున్న జేడీ విజయభాస్కర్

మద్దిపాడు: మండలంలోని గుండ్లాపల్లి జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో మూడు రోజులుగా జరుగుతున్న సబ్జెక్టు ఉపాధ్యాయుల శిక్షణ కార్యక్రమాన్ని స్టేట్ అకడమిక్ అండ్ మానిటరింగ్ జాయింట్ డైరెక్టర్ బి.విజయభాస్కర్ సోమవారం పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఉపాధ్యాయులంతా శిక్షణ కార్యక్రమంలో నేర్చుకున్న అంశాలతో తరగతి గదిలో విద్యార్థులకు చక్కగా అర్థమయ్యేలా బోధన చేయాలని సూచించారు. కొత్త టెక్నాలజీ ద్వారా విద్యార్థులకు సులభంగా అర్థమయ్యే రీతిలో పాఠాలు చెప్పాలన్నారు. విద్యార్థుల పట్ల శ్రద్ధ వహించాలని సూచించారు. కార్యక్రమంలో ఏఎంఓ ఎం.రమేష్, పాఠశాల ప్రధానోపాధ్యాయుడు ప్రభాకర్, ఇతర పాఠశాలల ప్రధానోపాధ్యాయులు, రిసోర్స్‌పర్సన్లు, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

నా బిడ్డను ఆశీర్వదించండి



భారీ గజమాలతో బూచేపల్లి కుటుంబానికి ఘన స్వాగతం



ప్రచారానికి భారీగా హాజరైన స్థానికులు

- జిల్లా పరిషత్ ఛైర్‌పర్సన్ బూచేపల్లి వెంకాయమ్మ
- దర్శి ఒకటో వార్డులో ఇంటింటి ప్రచారం ప్రారంభం
- ఘన స్వాగతం పలికిన పార్టీ శ్రేణులు

దర్శి: × నా కుమారుడు బూచేపల్లి శివప్రసాద్‌రెడ్డిని ఆశీర్వదించి ఫ్యాన్ గుర్తుపై ఓటేసి అత్యధిక మెజారీతో గెలిపించాలని జిల్లా పరిషత్ ఛైర్‌పర్సన్ బూచేపల్లి వెంకాయమ్మ కోరారు. పట్టణంలోని ఒకటో వార్డులో సోమవారం ఇంటింటి ప్రచారాన్ని జెడ్పీ ఛైర్‌పర్సన్ బూచేపల్లి వెంకాయమ్మ, మాజీ ఎమ్మెల్యే బూచేపల్లి శివప్రసాద్‌రెడ్డి, ఆయన సతీమణి నందినీలు హాజరయ్యారు. తొలుత హరిహర సుత అయ్యప్ప స్వామి ఆలయంలో ప్రత్యేక పూజలు చేశారు. ఆలయ నిర్వాహకులు వేదపండితులు పూర్ణకుంభంతో స్వాగతం పలికారు. అనంతరం పార్టీ శ్రేణులు క్రేన్ సాయంతో భారీ గజమాల వేశారు. ఈ సందర్భంగా ఇంటింటికీ తిరిగి యోగక్షేమాలు అడిగి తెలుసుకొని శివప్రసాద్‌రెడ్డికి ఓట్లేసి అత్యధిక మెజార్టీతో గెలిపించాలని విజ్ఞప్తి చేశారు. కూరగాయల దుకాణాల్లో వ్యాపారులతో చర్చించారు. వెంకాయమ్మ హోటల్‌లో దోశలు పోసి కార్యకర్తల్లో ఉత్సాహం నింపారు. బూచేపల్లి నందినీ అందరినీ చిరునవ్వుతో ఆప్యాయంగా పలకరిస్తూ తన భర్తకు ఫ్యాన్ గుర్తు పై ఓట్లేసి అత్యధిక మెజార్టీతో గెలిపించాలని విజ్ఞప్తి చేశారు. శివప్రసాద్‌రెడ్డితో పాటు ముగ్గురు కుటుంబ సభ్యులు ప్రచారంలో భారీ సంఖ్యలో కార్యకర్తలు, అభిమానులు కోలాహలంగా పాల్గొన్నారు. వృద్ధులతో మాట్లాడి వారి యోగక్షేమాలు అడిగి తెలుసుకున్నారు. ఈ సందర్భంగా వెంకాయమ్మ, శివప్రసాద్‌రెడ్డి మాట్లాడుతూ ఇంటింటి ప్రచారంలో ప్రజల సమస్యలను తెలుసుకొని పరిష్కరిస్తున్నామన్నారు. ఏ ఇంటికి వెళ్లినా సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ప్రవేశపెట్టిన పథకాలపై ప్రజలు హర్షిస్తున్నారని చెప్పారు. తాము ప్రచారానికి వెళ్లిన ప్రతి వీధిలో స్థానికుల నుంచి మంచి స్పందన వస్తుందని చెప్పారు. కార్యక్రమంలో షేక్ కార్పొరేషన్ డైరెక్టర్, వైద్యవిభాగం అధికార ప్రతినిధి డాక్టర్ ఎస్ఎం బాషా, వైఎస్సార్ సీపీ పట్టణ అధ్యక్షుడు కట్టెకోట హరీష్, వైఎస్సార్ సీపీ ఎస్సీసెల్ జిల్లా అధ్యక్షుడు గాలిమూటి దేవప్రసాద్, వార్డు కౌన్సిలర్లు జగన్నాథం



హోటల్‌లో దోశలు పోసి కార్యకర్తల్లో ఉత్సాహం నింపుతున్న బూచేపల్లి వెంకాయమ్మ

మోహన్‌బాబు, మజ్జువలి, చెరుకూరి జగన్, పుట్టా రవి, మేడం మోహన్‌రెడ్డి, ఆవుల జ్యోతి శివారెడ్డి, కర్ణా భాస్కర్‌రెడ్డి, వ్యవసాయ విభాగం రాష్ట్ర ఉపాధ్యక్షుడు మారెడ్డి సుబ్బారెడ్డి, మండల కన్వీనర్ వెన్నపూస వెంకటరెడ్డి, సొసైటీ అధ్యక్షుడు వేమిరెడ్డి చెన్నారెడ్డి, గ్రీనరీ అండ్ బ్యూటిఫికేషన్ డైరెక్టర్ కుమ్మిత అంజిరెడ్డి, వైస్ ఎంపీపీ సోము దుర్గారెడ్డి, నాయకులు రహమ్‌తుల్లా, కొల్లా ఉదయభాస్కర్, కొడవటి జాన్, ముప్పూరి బ్రహ్మయ్య, వెన్నపూస బాపిరెడ్డి, అంబటి వీరారెడ్డి, కర్ణా వెంకటరెడ్డి, చెవిరెడ్డి రాజారెడ్డి, వెన్నపూస నరసారెడ్డి తదితరులు పాల్గొన్నారు.

ప్రేమ పేరుతో వెంటాడి వేధించాడు

- క'సాయి' భర్తను కఠినంగా శిక్షించాలి
- పెళ్లికి యువతి తల్లిదండ్రులు అంగీకరించకపోవడంతో కత్తితో దాడి
- దామచర్ల అనుచరుడు కావడంతో ఎదిరించలేకపోయిన తల్లిదండ్రులు
- పెళ్లిచేసుకున్న మూడు నెలల్లోనే యువతికి నరకం చూపించాడు
- ఏడాది లోపే ఆత్మహత్య
- సాయిపై కఠిన చర్యలు తీసుకోవాలని దళిత సంఘాల డిమాండ్



భర్త సాయితో తులసి



దామచర్ల జనార్దన్‌తో సాయి

ఒంగోలు: రాజకీయ అండను అడ్డంగా పెట్టుకుని ఓ యువతిని ప్రేమ పేరుతో మభ్యపెట్టి, పెళ్లి చేసుకున్న తర్వాత అత్యంత కిరాతకంగా వేధింపులకు గురి చేసి, ఆమె ఆత్మహత్యకు కారణమైన కేసన సాయిరాఘవేంద్రని కఠినంగా శిక్షించాలని దళిత సంఘాల నేతలు డిమాండ్ చేస్తున్నారు. దళిత నాయకులు నీలం నాగేంద్రరావు, చప్పిడి వెంగళరావు, దారా అంజయ్య, కేరళ దిలీప్ తదితరులు సోమవారం తాలుకా సీఐ భక్తవత్సలరెడ్డిని కలిసి మాట్లాడారు. అనంతరం మీడియాకు వివరాలు వెల్లడించారు. స్థానిక ఇందిరమ్మ కాలనీకి చెందిన దళిత యువతి లింగతోటి తులసిని.. సాయిరాఘవేంద్ర ప్రేమ పేరుతో వెంటాడి గత ఏడాది ఫిబ్రవరి 5న గుడిలో వివాహం చేసుకొని మూడు నెలల్లోనే ఆమెకు నరకం చూపించాడన్నారు. వివాహం అనంతరం శారీరకంగా, మానసికంగా వేధించసాగి రూ.10 లక్షల కట్నం తీసుకురావాలంటూ కొట్టి పుట్టింటికి తరిమేశాడన్నారు. జులాయిగా తిరుగుతూ దామచర్ల అనుచరునిగా చలామణి అయ్యే సాయి.. అత్తమామలు కట్నం ఇవ్వకపోవడంతో గొడ్డలితో చంపుతానని బెదిరించడంతో తాలూకా పోలీసులు రౌడీషీట్ కూడా ఓపెన్‌చేశారన్నారు. ఇటీవల బంధువుల అనారోగ్యంతో రిమ్స్‌లో చికిత్స పొందుతుండంతో తులసి వారిని పరామర్శించేందుకు బంధువుల మోటారు సైకిల్‌పై వెళ్లిందన్నారు. ఇది గమనించిన సాయి అత్తగారింటికి చేరుకుని తులసిని ఇష్టం వచ్చినట్లు కొట్టాడని, అడ్డువచ్చిన తల్లిదండ్రులు, బంధువులపై హత్యాయత్నం చేశాడన్నారు. దీంతో తీవ్రంగా మనస్తాపం చెందిన తులసి పురుగుల మందు తాగి ఆత్మహత్యయత్నం చేయడంతో తల్లిదండ్రులు ప్రైవేట్ వైద్యశాలకు తరలించగా అప్పటికే మృతి చెందిందన్నారు. ప్రేమ పేరుతో వివాహం చేసుకొని ఆమెను వేధించి ఆత్మహత్యకు కారణమైన సాయిపై అట్రాసిటీ కేసు నమోదు చేయాలని డిమాండ్ చేశారు.

ఇడుపులపాయ టూ ఇచ్ఛాపురం

- వైఎస్సార్ సీపీ 175 సీట్లు గెలవాలని ఆకాంక్షిస్తూ ఓ నాయకుడు పాదయాత్ర



వైఎస్సార్ విగ్రహానికి నివాళులర్పిస్తున్న బసవరావు, నాయకులు

సింగరాయకొండ (టంగుటూరు): వచ్చే ఎన్నికల్లో రాష్ట్రంలోని మొత్తం 175 సీట్లలో వైఎస్సార్ సీపీ విజయం సాధించి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి మళ్లీ సీఎం కావాలని ఆకాంక్షిస్తూ ఇడుపులపాయ నుంచి ఇచ్ఛాపురం వరకు 2 వేల కిలోమీటర్లు పాదయాత్ర చేపట్టినట్లు పార్టీ నాయకుడు కట్టిపోగు బసవరావు తెలిపారు. పాదయాత్రలో భాగంగా ఇప్పటివరకు 1,200 కిలోమీటర్లు పూర్తి చేసినట్లు చెప్పారు. పార్టీ రాష్ట్ర యువజన విభాగం కార్యదర్శి శీలం రాము తన అనుచరులతో కలిసి బసవరావుకు ఘనంగా స్వాగతం పలికారు. కందుకూరు రోడ్డు సెంటర్‌లో వైఎస్సార్ విగ్రహానికి పూలమాల వేసి నివాళులర్పించి బసవరావును ఘనంగా సత్కరించారు. రాష్ట్ర మహిళా కార్యదర్శి రాపూరి ప్రభావతి, మాజీ సర్పంచ్ చుక్కా కిరణ్‌కుమార్, జిల్లా సాంస్కృతిక విభాగం కార్యదర్శి పాలూరి శ్రీనివాసులరెడ్డి, సర్పంచ్ బల్లెకూర బ్రహ్మయ్య, కొక్కిలిగడ్డ హనుమంతరావు, సుదర్శి వెంకట్రావు, సురేష్ తదితరులు పాల్గొన్నారు.

హైదరాబాద్ వెళ్లి పింఛన్ల అందజేత



కాశయ్యకు పింఛన్ అందజేస్తున్న వలంటీర్ రమణారావు



హైదరాబాద్‌లో ఖాశీంబీకి పింఛన్ అందిస్తున్న వలంటీర్ కరీష్మా

బేస్తవారిపేట: మండలంలోని జేబీకే పురానికి చెందిన జలపాటి చిన్న కాశయ్య అనారోగ్యంతో బాధపడుతున్నాడు. హైదరాబాద్‌లో వైద్య చికిత్స పొందుతున్నాడు. గ్రామ వలంటీర్ పీవీ రమణారావు అక్కడకు వెళ్లి రూ.3 వేల వృద్ధాప్య పింఛన్ నగదు అందజేశాడు. హైదరాబాద్ వచ్చి పింఛన్ అందజేసిన వలంటీర్‌కు చిన్న కాశయ్య కుటుంబ సభ్యులు కృతజ్ఞతలు తెలిపారు.

తర్లుపాడుకు చెందిన ఖాశీంబీకి...

తర్లుపాడు: తర్లుపాడుకు చెందిన ఖాశీంబీ పెరాలసిస్ వ్యాధితో బాధపడుతూ కొన్ని రోజులుగా హైదరాబాద్‌లో చికిత్స పొందుతోంది. ఈ విషయం తెలుసుకున్న క్లస్టర్ వలంటీర్ షేక్ కరీష్మా హైదరాబాద్ వెళ్లి వృద్ధాప్య పింఛన్ అందజేయడంతో ఖాశింబీ సంతోషం వ్యక్తం చేసింది. మహిళా వలంటీర్‌కు ఇద్దరు చిన్నపిల్లలు ఉన్నప్పటికీ ఇంటి వద్ద ఉంచి హైదరాబాద్ వెళ్లి పింఛన్ అందజేయడంపై సర్పంచ్ పి.వరాలు, ఎంపీపీ భూలక్ష్మి, పంచాయతీ సెక్రటరీ, కోఆప్షన్ సభ్యులు అక్బర్ అలీ, వెల్ఫేర్ అసిస్టెంటు, అధికారులు, సచివాలయ సిబ్బంది అభినందించారు.

అంబేడ్కర్ ఓపెన్ యూనివర్సిటీ అడ్మిషన్ల గడువు పెంపు

ఒంగోలు సెంట్రల్: డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ ఓపెన్ యూనివర్సిటీ అడ్మిషన్ల గడువు పెంచినట్లు రీజినల్ కో ఆర్డినేటర్ ఎం.శ్రీనివాసరావు తెలిపారు. బీఏ, బీకాం, బీఎస్సీ కోర్సులలో చేరేందుకు ఇంటర్, పాలిటెక్నిక్, ఐటీఐ పాసైన వారు అర్హులని చెప్పారు. ఈ నెల 16వ తేదీ అడ్మిషన్లకు అఖరు తేదీ అని చెప్పారు. యూనివర్సిటీ వెబ్‌సైట్‌ను సందర్శించి పూర్తి వివరాలు తెలుసుకోవచ్చని అన్నారు. ఒంగోలులోని సీఎస్ఆర్ శర్మ కాలేజీ, ఒంగోలు స్టడీ సెంటర్‌లో సంప్రదించాలని చెప్పారు. ఇతర వివరాలకు 73829 29613 సెల్ నంబర్‌ను సంప్రదించాలని సూచించారు. విద్యార్థులు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని కోరారు.

ఆర్టీసీ బస్సు, ఆటో ఢీ

- ఆటోలో ప్రయాణిస్తున్న మహిళ మృతి
- మరో ఇద్దరికి గాయాలు



నుజ్జు నుజ్జు అయిన ఆటో



మృతిచెందిన రూత్‌మేరి



వైద్యశాలలో చికిత్స పొందుతున్న చంటిర్

బేస్తవారిపేట: జాతీయ రహదారిపై స్థానిక పోలీస్‌స్టేషన్ సమీపంలో ఆర్టీసీ బస్సు, ఆటో ఢీకొన్న ప్రమాదంలో ఒకరు మృతి చెందగా మరో ఇద్దరికి గాయాలయ్యాయి. ఈ సంఘటన సోమవారం రాత్రి జరిగింది. వివరాల్లోకి వెళితే..మార్కాపురం పూలసుబ్బయ్య కాలనీకి చెందిన రాచీటి రూత్‌మేరి, చంటి, మరో ఇద్దరు పోరుమామిళ్ల మండలం నాగులకుంటలో బంధువుల వివాహానికి ఆటోలో వెళ్లారు. తిరుగు ప్రయాణంలో బేస్తవారిపేట పోలీస్‌స్టేషన్ సమీపంలో రోడ్డుపై గడ్డి ట్రాక్టర్‌ను పోలీసులు తనిఖీ చేస్తుండగా ఓవర్‌క్రాస్ చేస్తుండగా గిద్దలూరు డిపోకు చెందిన ఆర్టీసీ బస్సు మార్కాపురం నుంచి నంద్యాల వెళ్తుంది. బస్సును ఆటో ఒకవైపున ఢీకొనడంతో ఆటో నుజ్జు నుజ్జయింది. ప్రమాదంలో ఆటోలో ప్రయాణిస్తున్న రూత్‌మేరి(47) తల పగిలి, రెండు కాళ్లు విరిగిపోయాయి. చంటి, డ్రైవర్ తిరుమలయ్యకు గాయాలయ్యాయి. క్షతగాత్రులను 108లో కంభం ప్రభుత్వ వైద్యశాలకు తరలించగా చికిత్స పొందుతూ రూత్‌మేరి మృతి చెందింది. ఎస్సై బి.నరసింహారావు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

గుంటూరు సాయిభాస్కర్‌లో రోబోటిక్ సర్జరీలు

- విలేకరుల సమావేశంలో డాక్టర్ నరేంద్రరెడ్డి



రోబోటిక్‌తో కీళ్ల ఆపరేషన్ చేసే విధానాన్ని వివరిస్తున్న డాక్టర్ నరేంద్రరెడ్డి

గుంటూరు మెడికల్: ప్రపంచ వ్యాప్తంగా రోబోటిక్, ఆర్టిఫీషియల్ ఇంటిలిజెన్స్ అన్ని విభాగాల్లో అందుబాటులోకి వచ్చిందని గుంటూరు సాయి భాస్కర్ రోబోటిక్ జాయింట్ రీప్లేస్‌మెంట్ సెంటర్ అధినేత, సీనియర్ జాయింట్ రీప్లేస్‌మెంట్ సర్జన్ డాక్టర్ బూసిరెడ్డి నరేంద్రరెడ్డి తెలిపారు. స్థానిక అరండల్‌పేటలోని సాయిభాస్కర్ రోబోటిక్ జాయింట్ రీప్లేస్‌మెంట్ సెంటర్‌లో సోమవారం నిర్వహించిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. మోకీళ్ల మార్పిడి ఆపరేషన్లలో రెండు నుంచి మూడు శాతం ఫెయిల్యూర్స్ ఉంటాయని, అవి కూడా లేకుండా నూటికి నూరు శాతం మోకీళ్ల మార్పిడి ఆపరేషన్ విజయవంతం చేయడంలో రోబోటిక్ ఆపరేషన్లు కీలకపాత్ర పోషిస్తాయని వివరించారు. తమ హాస్పిటల్‌లో 150 మందికిపైగా రోబోటిక్ జాయింట్ రీప్లేస్‌మెంట్ సర్జరీలు విజయవంతంగా చేశామని చెప్పారు. ఏపీలోనే మొట్టమొదటి సారిగా ఫుల్లీ ఆటోమేటిక్ రోబోటిక్ జాయింట్ రీప్లేస్‌మెంట్ సర్జరీలు తమ ఆస్పత్రిలో చేస్తున్నామని తెలిపారు. రోబోటిక్ సర్జరీ ద్వారా పరికరాల వినియోగం చాలా తక్కువగా ఉంటుందని, తద్వారా ఇన్‌ఫెక్షన్ సోకదని పేర్కొన్నారు. రక్తం పోవడం చాలా తక్కువగా ఉంటుందని, నొప్పి ఉండదని, త్వరగా రోగి కోలుకుంటాడని, జాయింట్ల కాలపరిమితి కూడా ఎక్కువ కాలం ఉంటుందని వివరించారు. ప్రకాశం జిల్లా ముండ్లమూరు మండలం వేంపాడు గ్రామానికి చెందిన 63 సంవత్సరాల గుప్తా సుబ్బారావుకు 16 ఏళ్లుగా మోకీళ్ల సమస్య ఉండి ఎడమ కాలు పూర్తిగా వంగిపోయిందన్నారు. గుంటూరు అమరావతి రోడ్డుకు చెందిన 72 సంవత్సరాల జ్ఞానసుందరికి కుడికాలు తీవ్రమైన నొప్పి ఉండటంతో వీరిద్దరికి నవంబరు 2న రోబోటిక్ సాయంతో మోకీళ్ల మార్పిడి ఆపరేషన్ విజయవంతంగా చేశామని డాక్టర్ నరేంద్రరెడ్డి వెల్లడించారు.

సర్పంచ్ ఇంట్లో చోరీ

- బంగారు ఆభరణాలు, నగదు అపహరణ



ఘటన స్థలాన్ని పరిశీలిస్తున్న ఎస్సై త్యాగరాజు

కనిగిరి రూరల్: కొట్టాలపల్లి సర్పంచ్ రామన భాస్కర్‌రెడ్డి ఇంట్లో దొంగలు పడి బంగారు ఆభరణాలు, నగదు అపహరించుకెళ్లారు. ఈ సంఘటన సోమవారం వెలుగు చూసింది. వివరాల్లోకి వెళితే వెలిగండ్ల మండలం కొట్టాలపల్లి సర్పంచ్ రామన భాస్కర్‌రెడ్డి కొత్తూరులో నివాసం ఉంటున్నారు. ఆదివారం ఇంటికి తాళం వేసి స్వగ్రామం కొట్టాలపల్లికి వెళ్లారు. సోమవారం తిరిగి వచ్చి చూడగా దొంగలు ఇంటి తాళం పగులకొట్టి లోపలికి ప్రవేశించి, బీరువా తాళం పగులకొట్టి అందులోని సుమారు 25 తులాల బంగారు ఆభరణాలు, రూ.54 వేల నగదు, పాస్‌కార్డులు, ఏటీఎం కార్డులు దొంగలించుకుని వెళ్లినట్లు బాధితులు తెలిపారు. ఈ మేరకు ఎస్సై త్యాగరాజు సంఘటనా స్థలాన్ని సందర్శించి కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

మార్కాపురంలో చోరీ

మార్కాపురం: మార్కాపురం పట్టణంలో దొంగలు మరోసారి తమ చేతివాటాన్ని ప్రదర్శించారు. సోమవారం ఉదయం పట్టణంలోని జవహర్‌నగర్ కాలనీలో నివాసముంటున్న రిటైర్డు టీచర్ నారు వెంకటరెడ్డి ఇంటి తాళాలు పగులకొట్టి లోపలికి ప్రవేశించి నగదు, వెండి, బంగారు ఆభరణాలను తీసుకెళ్లారు. వెంకటరెడ్డి మూడు రోజుల క్రితం బెంగుళూరు వెళ్లాడు. సోమవారం ఉదయం వెంకటరెడ్డి ఇంటిపక్కన ఉన్న బంధువులు తాళం పగులకొట్టి ఉండటాన్ని గమనించి బెంగుళూరులో ఉన్న వెంకటరెడ్డికి, పోలీసులకు సమాచారం ఇచ్చారు. ఎంత మొత్తంలో బంగారం, నగదు పోయిందనే విషయం తెలియాల్సి ఉంది. సోమవారం రాత్రికి బెంగుళూరు నుంచి వెంకటరెడ్డి కుటుంబ సభ్యులు మార్కాపురం వస్తారు. కాగా శనివారం అర్ధరాత్రి కంభం రోడ్డులోని శివాజీనగర్ 5,6 లైన్లలో సుమారు మూడు ఇళ్లలో దొంగలు తాళాలు పగులకొట్టి దొంగతనాలకు పాల్పడ్డారు. జవహర్‌నగర్ కాలనీలో జరిగిన దొంగతనంపై ఇంకా ఎటువంటి ఫిర్యాదు అందలేదని ఫిర్యాదు అందగానే కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తామని పట్టణ ఎస్సై రెహమాన్ తెలిపారు.

పొలాల్లో మోటార్ వైర్ల చోరీ



చెల్లా చెదురుగా పడిఉన్న పైపులు

పీసీపల్లి: మండల పరిధిలోని పిల్లివారిపల్లి గ్రామ పొలాల్లో మోటార్లు, రాగి తీగ, సర్వీస్ వైర్లు చోరీకి గురయ్యాయి. ఈ సంఘటన ఆదివారం రాత్రి జరిగింది. రైతులు సోమవారం పొలాలకు నీరు పెట్టేందుకు కరెంట్ మీటర్లు ఆన్ చేయగా ఆన్ కాకపోవడంతో మోటార్లు పరిశీలించారు. సర్వీస్ వైర్లు, మోటార్లు, రాగి తీగలు చోరీకి గురైనట్లు గుర్తించారు. దీంతో 12 మంది రైతులు పోలీసులకు సమాచారమందించగా కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు. సుమారు రూ.5 లక్షల వరకు నష్టం వాటిల్లినట్లు రైతులు బాల గురవయ్య, కొండయ్య, నరసింహం, రామిరెడ్డి, చెంచిరెడ్డి తెలిపారు.